ప్రజాశక్తి

శుక్రవారం 27 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



పోరాట పతాక.. శ్రామిక జన గీతిక...



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన బహిరంగసభకు హాజరై సంఘీభావం తెలుపుతున్న సీతారాంఏచూరి (ఫైల్)

- 28, 29 తేదీల్లో విశాఖ జిల్లా 24వ మహాసభలకు సిపిఎం సిద్ధం
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలువరించేందుకు నిరంతర పోరాటాలు
- 'ఉక్కు'పై గత వైసిపి, నేటి కూటమి పాలకుల వైఫల్యం
- 2024 ఎన్నికల్లో పార్టీలన్నీ మాట్లాడేలా అజెండా చేసిన ఎర్రజెండా



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కార్మిక ఉద్యమాలకు బాసటగా నిలిచే 'శ్రామిక జన సారధి... ఉద్యమాలవారధి' సిపిఎం 24వ విశాఖ జిల్లా మహాసభలకు ఈ నెల 28, 29 తేదీల్లో సిద్ధమైంది. ఈ నెల 28న ఉదయం 9గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి సుజాతనగర్ వరకూ భారీ ప్రజా, కార్మిక ప్రదర్శన అనంతరం అక్కడే బహిరంగ సభతో ప్రారంభం కానున్నాయి. మూడేళ్లకోసారి జరిగే పోరాట పతాక సిపిఎం మహాసభలకు విశాఖపట్నం జిల్లా నలుమూలల నుంచీ పెద్ద సంఖ్యలో వివిధ రంగాలు, సంఘాల్లో పనిచేస్తోన్న కార్మికులు, సామాన్య ప్రజానీకం, మహిళలు, బాల, బాలికలు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే జీవనాడి, తీర ప్రాంతంలో ఉండే ఏకైక ఉక్కు కర్మాగారం 'వైజాగ్ స్టీల్ ప్లాంట్'ను 2021 నుంచి కేంద్రంలోని బిజెపి మోడీ సర్కారు ప్రమాదంలో పడేసింది. 100శాతం ప్రైవేటీకరణ

మిగతా 2లో..

కుసులువాడ మైనింగ్ తవ్వకాలు రద్దు చేయాలని...

సిపిఎం సంతకాల సేకరణ

నేడు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులువాడ మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దుచేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన కుసులువాడ, చిన్నయ్యపాలెం, ఇచ్చాపురం, రేగానిగూడెం గ్రామాల్లో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల 28వ తేదీన కుసులువాడ పంచాయతీ సర్వే నెంబర్ 104 తెల్లకొండ (ఎద్దు కొండ)పై మైనింగ్ తవ్వకాల నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ మరలా నిర్వహిస్తున్నారని, దీన్ని ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన ప్రభుత్వాలే వారికి రక్షణ లేకుండా చేస్తున్నాయన్నారు. బ్లాస్టింగ్ రహిత అనుమతులంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్న ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టటానికి ప్రజలు సిద్ధం కావాలని, సిపిఎం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.నాగరాణి, శినగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

పర్యావరణానికి హాని కలిగించే మైనింగ్ తవ్వకాలను రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం కుసలవాడ పంచాయతీలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు కుసులువాడ, చిన్నయ్యపాలెం ఇచ్చాపురం, రేగానిగూడెం తదితర గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ప్రజలు, యువకులు, స్వచ్ఛంద సేవకులు, నాయకులు తరలిరావాలని కోరారు.



కుసులువాడ పంచాయతీలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

కాంట్రాక్టు వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి 6లోగా దరఖాస్తులు

▶ వార్త 4లో..

వాల్తేరు డిఆర్ఎంగా లలిత్ బోహ్రా

▶ వార్త 8లో..

వర్షాలతో పంటలకు అపార నష్టం

▶ వార్త 3లో..

18 కిలోల గంజాయి స్వాధీనం

▶ వార్త 3లో..



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న మత్స్యకారులు

సునామీకి 20 ఏళ్లు...

సముద్రంలో మత్స్యకారుల పూజలు

వార్త మెయిన్‌లో....

నూతన సంవత్సర వేడుకలకు...

పోలీసు మార్గదర్శకాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి హోటళ్లు, క్లబ్బులు, పబ్బులు నిర్వహణకు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ ఆధ్వర్యాన గురువారం మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రధానంగా అర్ధరాత్రి ఒంటిగంట వరకు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించాలని అంతకంటే ఎక్కువ సమయం నిర్వహించాలి అనుకుంటే ముందుగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే ప్రాంతంలో ప్రవేశ - నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని, రికార్డింగ్ కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సెక్యూరిటీ గార్డులను నియమించాలని సూచించారు. ప్రైవేట్ రిసార్ట్స్ వద్ద ఉండే స్విమ్మింగ్ పూల్ సమీపంలో గార్డులను ఏర్పాటుచేయాలని మద్యం మత్తులో ఉన్న వారిని స్విమ్మింగ్ పూల్‌లోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని, మ్యూజిక్ శబ్దాలు 45 డెసిమల్ లేదా దాని కంటే తక్కువ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈవెంట్ ప్రదేశాల్లో ఎటువంటి ఆయుధాలనూ అనుమతించరాదని తెలిపారు. నిర్వాహకులు సామర్థ్యాన్ని మించి పాసులు/టికెట్లు/కూపన్లు జారీ చేయరాదని, ప్రత్యేకమైన పార్కింగ్ ఏర్పాటుచేయాలని, కపుల్స్ కోసం నిర్వహించే కార్యక్రమాలలో మైనర్లు ప్రవేశించకుండా జాగ్రత్త పడాలని ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల్లో మాదకద్రవ్యాలు/ నార్కోటిక్/ సైకోట్రోఫిక్ పదార్థాలు ఉపయోగించడానికి అనుమతి లేదని, ఈ విషయంలో విఫలమైతే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అనుమతించిన సమయానికి మించి మద్యం అందించకూడదని పేర్కొన్నారు. మద్యం తాగి ఉన్న కస్టమర్లను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడానికి డ్రైవర్లు క్యాబ్‌లను అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు నిర్వాహకులే ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలలో ఎటువంటి మందుగుండు సామాగ్రి ఉపయోగించడానికి అనుమతులు లేవని, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆదేశాలు తప్పకుండా అమలుపరచాలని పేర్కొన్నారు. నూతన సంవత్సర సంబరాలకు విలువైన వస్తువులను, బ్యాగులను తీసుకువెళ్లరాదని పేర్కొన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా షీ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే మహిళలు వారిని సంప్రదించాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి..

పోరాట పతాక.. శ్రామిక జన గీతిక...

చేయాలని, లేదంటే అమ్మేస్తామంటూ చేసిన నాటి ప్రకటన నుంచీ నేటివరకూ ఎడతెరిపి లేని ఉద్యమాలు స్టీల్ పరిరక్షణకు నిర్వహించడంలో సిపిఎం పాత్ర అత్యంత కీలకమైనది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కేవలం కార్మికుల సమస్యే కాదని ప్రజా ఉద్యమంగా మలచడంలో సిపిఎం జరిపిన కృషి కారణంగా మూడేళ్ళు దాటి 4వ ఏట అడుగుపెడుతున్నా ప్రైవేటీకరణను కేంద్రం చేయలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

దశల వారీ అనేకానేక పోరాటాలు...

సభలు, సమావేశాలు, సదస్సులు, ప్లాంట్ వద్ద గేట్ మీటింగులు, మానవ హారాలు, బైక్ ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, విశాఖ మహానగర పాలక సంస్థలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ చేయించిన ప్రైవేటీకరణ వ్యతిరేక తీర్మానాలు ఈ కాలంలో స్టీల్‌ప్లాంట్ సమస్యను ప్రజలకు దగ్గర చేసి కార్మిక ఆందోళనలపై పెద్ద ఎత్తున ఒక మద్దతును కూడగట్టేలా చేశాయి. ఇలా 'ఇంతింతై వటుడింతై' అన్న రీతిలో సిపిఎం నిర్వహించిన పాత్ర విశాఖకే పరిమితం కాకుండా అన్ని తరగతుల్లోనూ రాష్ట్ర వ్యాపిత ఉద్యమ తీవ్రతను పెంచింది.

కార్మికుల పోరాటానికి సీతారాం ఏచూరి వెన్నుదన్ను

కేంద్రంలోని మోడీ నిర్ణయమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు సాగిస్తున్న పోరాటానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వెన్నుదన్నుగా నిలిచారు. 2024 ఏప్రిల్ 5న కూర్మన్నపాలెం వద్ద ఉక్కు రక్షణ బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'ఉక్కు యజమానులకు ప్లాంట్‌ను అమ్మే అర్హత ఎవరిచ్చారని ఈ సభలో ఏచూరి ప్రశ్నించారు. సిపిఎం మీతోనే ఉంది అని చెప్పగానే స్టీల్ కార్మికులు పెద్ద ఎత్తున చప్పట్లతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయేలా 'హర్షం' వ్యక్తం చేశారు. మోడీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉక్కు దీక్షాపరులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇలా సీతారాం ఏచూరి చేసిన ప్రసంగం అక్కడకు హాజరైన 10వేలమంది కార్మికులు, వారి కుటుంబాలను ఉత్తేజపరిచింది. కేంద్రంలోని ఉక్కు శాఖా మంత్రి, ఆర్థిక మంత్రి ఇతర మంత్రులను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలే కాకుండా స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి సారథి అయిన సిపిఎమ్‌కు చెందిన ఎంపీలు ఉక్కు మంత్రికి వినతిపత్రాలు ఇస్తూ సమస్య పరిష్కారానికి మూడేళ్లుగా కృషిసాగిస్తూనే ఉన్నారు. గతంలో విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలైన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ను కేంద్రంలోని బిజెపి ప్రైవేటీకరించాలని నిర్ణయించినప్పుడు అంతకుముందు బిహెచ్‌పివి, తాజాగా విశాఖ పోర్టు పరిరక్షణ కోసం, చారిత్రాత్మక పోర్టు సిల్వర్ జూబ్లీ ఆసుపత్రిని పిపిపికి ఇవ్వాలన్న నిర్ణయంపైనా సిపిఎం నిరంతర పోరాటాలను పార్లమెంట్‌లోపల, బయటా నిర్వహించడంలో కీలక పాత్రపోషిస్తూనే ఉంది.

రాజకీయ అజెండా చేశాం : సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

స్టీల్‌ప్లాంట్ రక్షణకు కార్మికులనే కాకుండా ప్రజా ఉద్యమంగా మలచడమే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 1500 కిలోమీటర్ల బైకు యాత్రను చేసి 2024 ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలకు అజెండా చేసిన ఘనత సిపిఎందేనని విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రజాశక్తికి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల సిపిఎం కార్యదర్శులతో రెండు రోజుల పాటు విశాఖలో నిరాహార దీక్షలు చేశామన్నారు. ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నాలు, బంద్‌లు చేపట్టామని తెలిపారు. గత వైసిపి, నేటి 'కూటమి' పార్టీలు స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రాన్ని నిలదీయడంలో విఫలం అవుతున్నాయన్నారు. ఈ రకమైన ప్రజా ఉద్యమాల వల్లే 4 సంవత్సరాలు గడిచినా ఒక్కశాతం కూడా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ను అమ్మలేకపోయిందన్నారు.

న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28వ తేదీన జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని జ్ఞానాపురంలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ వద్ద పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విప్లవకారుల ఐక్యతలో భాగంగా రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రధాన వక్తగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరౌతారని చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ, ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బ తీస్తుందన్నారు. గత పదేళ్ల కాలంలో కార్పొరేట్ విధానాలను అవలంభిస్తూ, దేశ సహజ సంపదనంతా వారికి దోచి పెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించే వారిని అణిచివేయడం నిత్య కృత్యంగా జరుగుతున్నాయన్నారు. ఇలాంటి కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులు అంతా ఐక్యమై ప్రజల తరుపున పోరాటం చేయాలన్నారు. నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీకి ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గీత, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై సామాజిక సర్వే

విశాఖ జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై సమీక్ష చేసేందుకు, పథకాలు అమలు చేసేందుకు, మెరుగైన పాలసీ రూపకల్పన కోసం నిర్వహించిన కులగణనపై గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే (సోషల్ ఆడిట్)ను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఈ నెల 26వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో సోషల్ ఆడిట్ జరుగుతుందని, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ కూడా ఉంటుందని గురువారం తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి సచివాలయం పరిధిలో సంబంధిత కులగణనకు సంబంధించిన జాబితాలను ప్రచురించాలని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీన కులగణనకు సంబంధించిన సర్వే డేటాను సచివాలయాల్లో ప్రచురించాలని, 26 నుంచి 31వ తేదీ వరకు ప్రజల నుంచి లేదా థర్డ్ పార్టీ నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, అభ్యంతరాల వివరాలను అధికారులు ఆన్‌లైన్ చేయాలని, తదనంతరం డేటా ధ్రువీకరణ చేసి జనవరి 10వ తేదీన తుది కులగణన సర్వే డేటా ప్రచురించాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారులు ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. సోషల్ ఆడిట్ నిర్వహణకు సంబంధించి జెసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకాలు జారీ చేయగా, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి సచివాలయ సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి ప్రక్రియ నిర్వహణ, ఇతర అంశాలపై ఆన్ లైన్ శిక్షణ ఇచ్చారు.

28న జివిఎంసి దుకాణాలకు వేలం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి జోన్-4 పరిధిలోని దుకాణాలు, కల్యాణ మండపాలకు ఈ నెల 28వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. 31వ వార్డులోని దయాస్ ట్యాంక్ వాణిజ్య సముదాయం పైఅంతస్తులోని షాపులు, కింద సెల్లార్లలో ఉన్న 9, 10, 11, 12, 13, 15 దుకాణాలకు, టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని 3, 21, 25, 26, 31, 35, 39, 47 దుకాణాలకు వేలం వేస్తున్నట్లు చెప్పారు. 35వ వార్డు పరిధి పాత బస్ స్టాండ్ ఫేజ్-2లోని 1 నుంచి 14 దుకాణాలు, సూర్యాబాగ్ జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 9వ నంబర్ షాపు, 39వ వార్డు పద్మానగర్ లక్ష్మీటాకీస్ వద్ద వాణిజ్య సముదాయం దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. ఈ దుకాణాలకు మూడేళ్ల కాలపరిమితికి వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీన జోన్-4 కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యాన ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో యువతీయువకులకు కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహణ బాధ్యులు ఎం.ఎల్లాజీ ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్, వెబ్ టెక్నాలజీ, ఐటి కోర్సులు, మల్టీ మీడియా వంటివి యువతకు ఉపాధి కల్పించే అనేక కంప్యూటర్ సంబంధిత లాంగ్వేజెస్‌లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ బేసిక్స్‌కు 45 రోజులు, ఇతర సాఫ్ట్ వేర్ సంబంధిత కోర్సులకు 60 రోజుల నుంచి 90 రోజుల కాల పరిమితి ఉంటుందని తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి మొదటి బ్యాచ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 88853 51807 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పెద్ద సినిమాల టికెట్టు ధరలు పెంచకుండా చూడాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతికి విడుదల కానున్న పెద్ద చిత్రాలకు టికెట్ రేట్లు భారీగా పెంచుకునే అవకాశం ఇవ్వకూడదని, సాధారణ రోజుల్లో ఎంత ధర ఉంటే ఆ విధంగానే అమ్మకాలు జరపాలని ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ నాయకులు జివిఎల్ పద్మ కోరారు. గురువారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మీడియాతో ఆమె మాట్లాడుతూ, పేదవారికి సినిమా వినోదం ఒక్కటే అందుబాటులో ఉందని, టికెట్ రేట్లు పెంచి పేదలను వినోదానికి దూరం చేయడం సరికాదని పేర్కొన్నారు. సినిమాలకు అదనపు షోల పేరుతో భారీగా టికెట్లు రేటు పెంచడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అటువంటి నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకొని ప్రజలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా బి.వి.రమణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ హోదాలో బి.వి.రమణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు వైద్యులు, కెజిహెచ్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వందే భారత్ ప్రయాణికులకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వందేభారత్ రైలు ప్రయాణికుల కోసం రైల్వేస్టేషన్ నుంచి నగర పరిధిలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడపడానికి చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్లను జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఆదేశించారు. విశాఖపట్నం, ద్వారకా బస్ స్టేషన్‌లో సిటీ ప్లాట్ ఫామ్‌లోని ప్రయాణికుల సౌకర్యార్థం అల్పాహార హోటల్, శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లు ప్రయాణికుల సౌకర్యార్థం కూల్ డ్రింక్స్ షాప్స్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర ప్రయాణికులు ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, పిబిఎంకె.రాజు, పర్సనల్ ఆఫీసర్, జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఈ.పి.10/2024 ఇన్ ఓ.ఎస్.1872/2012
డిక్రీహోల్డర్ :
కొంతాల సూరిజగ్గారావు ...D.Hr/Petitioner
అండ్ :
వంటాకుల ఛాయ మరియొకరు ... J.Drs/ Respondents

Order 21 Rule 54 1A నోటీసు
1, 2, JDrs/ Respondents కు నోటీసు

టు,
1. వంటాకుల ఛాయ w/o వీరభద్రప్రసాద్, హిందూ వయస్సు 53సం॥లు. D.No.48-13-31, ఇందిరా భవన్ శ్రీనగర్, రామాటాకీస్ దగ్గర, విశాఖపట్నం.
2. వంటాకుల వీరభద్రప్రసాద్ S/o అప్పారావు, హిందూ, వయస్సు 60 సం॥లు D.No.48-13-31, ఇందిరా భవన్, రామాటాకీస్ దగ్గర, శ్రీనగర్, విశాఖపట్నం

పై నెంబరు EPలో శ్రీకోర్టువారు మీ హాజరు నిమిత్తం తే.6.1.2025దికి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు EP 10/2024 తీర్మానించబడును.

A.S.V. ప్రసాద్,
అడ్వకేట్, అనకాపల్లి
సెల్ : 9440787552

Notice
IN THE COURT OF THE HON'BLE V ADDL.DIST.JUDGE::GUNTUR
M.V.O.P.No:1300/ 2022
Between:
Chokka Naga Mani. ...Petitioner
And
Kare Kotayya &Others ...Respondents
To,
R-1: Kare Kotayya, S/o.Tatabbyi, H.No. 67-28, Bangarammapalem, S.Rayavaram(Md), Visakhapatnam Dt., (Owner of the Auto AP 39 V 3032)
R-3: Kare Venkata Ramana, S/o. Appa Rao, Vizag Colony, Peddamunigal, Chandapet, Nalgonda Dt.
(Driver of the Auto AP 39 V 3032)

పై నెంబరు O.P. ని పిటీషనరు యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో 1& 3వ రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయుమని శ్రీ కోర్టు వారు ది:31-01-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:31-01-2025

కె.శివ ప్రసాద్,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్:9848119447

CAUTION NOTICE
Under the instructions of my clients **1) Nimmakayala Kanaka Rao, 2) Smt. N. Rajeswari, 3) N. Srinivas and 4) Smt. N. Jaya Lakshmi** R/o. D. No.48-3-2, Dwaraka Nagar, Visakhapatnam, I issue this notice.
One Nimmakayala Chandra Sekhar is son of client no. 1 above and brother of 3 and 4 above. Nimmakayala Chandra Sekhar married Smt. Nirmala in the year 2004, which was a love marriage. Due to that marriage all the relations between my clients, and Chandra Sekhar were strained. For the past 20 years there are no relations between my clients and said Chandra Sekhar. Now a days my clients came to know that general public are entering into financial dealings with said Chandra Sekhar. My clients have nothing to do with said Chandra Sekhar.Thus general public are here by cautioned that if any body enter into any agreements, or made any financial transactions or involved in any commitments with him such acts and deeds will not bind my clients and my clients are no longer responsible for the acts and deeds of Chandra Sekhar and general public will be doing so at their own risk and responsibility. My clients reserve their right to take appropriate legalaction against those who creates bad propaganda or nuisance against them.
P.T. MADHAV, M.A, B.L, DTA
Advocate
MIG-238, VUDA Colony
Visakhapatnam - 530018
Cell: 9848257381

అరకొరగా వేతన బకాయి విడుదల

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ప్రభుత్వం అరకొరగా వేతన బకాయి విడుదల చేసింది. జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరునెలల వేతనంచెల్లించాల్సి ఉండగా, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల పోరాట ఫలితంగా ప్రభుత్వం స్పందించి, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల బకాయిలను విడుదల చేసింది. భీమిలి మండలంతోపాటు జివిఎంసి జోన్ పరిధిలో 101 మంది శానిటేషన్ వర్కర్లు (ఆయాలు) నెలకు రూ 6 వేల వేతనంతో పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి వీరికి వేతనాలు చెల్లించకపోవడంతో సిఐటియు ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టగా, ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి శానిటేషన్ వర్కర్లతోపాటు 16 మంది నైట్ వాచ్‌మెన్లకు రూ.6 వేలు చొప్పున, అలాగే 156 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు, సహాయకులకు రూ3వేలు చొప్పున మూడు నెలల వేతనాలను విడుదల చేశారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు కూడా వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- సీతమ్మధార : మార్గశిర గురువారం పర్వదినాన్ని పురస్కరించుకుని తాటిచెట్లపాలెంలో రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్ దరి షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. షిరిడి సాయిబాబాధ్యానమందిరం వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు సారధ్యాన నిర్వహించిన అన్నసమారాధనను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రారంభించారు. కమిటీ సభ్యుల ఆధ్యాత్మిక, సేవాభావాన్ని కొనియాడారు. ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978 -81 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కళాశాల పూర్వ విద్యార్థులు మైలపల్లి లక్ష్మణరావు, డిఎస్ఎన్ రామకృష్ణ తెలిపారు. దంత వైద్యపరీక్షలతోపాటు ఇసిజి, బిపి తదితర పరీక్షలు నిర్వహించి,ఉచితంగానే మందులు అందజేస్తారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

29న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న తగరపువలసలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సమితి కన్వీనర్ జి సత్యనారాయణ, ఆధ్యాత్మిక సమన్వయకర్త టివిఆర్ బాబా, సేవాదళ్ కో ఆర్డినేటర్ సంతోష్ తెలిపారు. చిట్టివలస సాయిబాబా ఆలయ ప్రాంగణంలో రక్త దాన శిబిరం జరుగుతుందన్నారు.

వర్షాలతో పంటలకు అపార నష్టం

• పెట్టుబడులైనా వచ్చే పరిస్థితి లేదని రైతుల ఆవేదన • ఆదుకోవాలని వేడుకోలు



గద్దపేటలో మొలకెత్తిన వరి పనలతో రైతు ఎర్ర నాయుడు

ప్రజాశక్తి-పద్మనాభం : అల్పపీడన ప్రభావంతో మండలంలో వీడకుండా కురుస్తున్న వర్షాలతో ప్రధాన వరితోపాటు ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోసిన వరిచేను రోజుల తరబడి పొలాల్లోనే ఉండిపోవడంతో తడిచిన వరిచేనుపై గింజలు మొలకెత్తి నష్టం వాటిల్లుతోందని, ధాన్యం రంగు, నాణ్యత చెడిపోయిందని గద్దపేటలో రైతు జి.ఎర్రనాయుడు వాపోయాడు. తనపొలంలో వరి పనల్లో మొలకలెత్తిడాన్ని చూపించి ఆందోళన వ్యక్తంచేశారు. అలాగేకోరాడ పంచాయతీ గద్దపేట గ్రామంలో 40 సెంట్లు భూమిలో టమాటా, ఆనప కాయలు, ఇతర కూరగాయల పంటలను వేశానని, రూ. 40 పెట్టుబడి పెట్టి సాగుచేయగా, పంట ఆశాజనకంగా ఉందని, చేతికి అందొచ్చే దశలో వీడకుండా వర్షాలు కురవడం పంట పూర్తిగా పాడైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎకరం భూమిలో సాగుచేసిన మిరప, ఆనప, అరటి, టమోటా, క్యాబేజీ వంటి వాణిజ్య పంటలను సాగుచేశానని, దాదాపు రూ.60వేలు ఖర్చుయితే ఇటీవల వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతిందని కోరాడ నారాయణప్పడు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాలపై ఉద్యానవనన శాఖ అధికారులు పరిశీలన జరిపి, పంట నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం ద్వారా తమను ఆదుకునే చర్యలు చేపట్టాలని బాధిత రైతులు కోరుతున్నారు.



కుళ్లిన టమోటాలను చూపుతున్న రైతు నారాయణప్పడు

సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఇ శ్యాంబాబు

ప్రజాశక్తి -ఆనందపురం: ఇంటింటా సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటుతో కరెంట్‌బిల్లుల ఆదాతోపాటు, ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందడంతోపాటు ఇంకెన్నో ప్రయోజనాలున్నాయి ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎస్ఇ జి.శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని గంభీరం గ్రామంలో పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు.సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు, సోలార్ విద్యుత్ యూనిట్ల కోసం వినియోగదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు లీడ్‌మేనేజర్ శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, డిపిఒ శ్రీనివాసరావు, జోన్ -3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు, డిఇఇ రాజశేఖర్, ఎఇఇ సురేష్ కుమార్, ఎంపిడిఒ డాక్టర్ జానకి, మాజీ సర్పంచ్ వాసుపల్లి ముత్యాలరావు , ఇఒపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు

నేడు, రేపు పద్మనాభుని నవనీతోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : ధనుర్మాస ఉత్సవాలు సందర్భంగా పద్మనాభం అనంత పద్మనాభుని ఆలయంలో కుంతీ మాధవస్వామికి శుక్ర, శనివారాల్లో నవనీతోత్సవంలో భాగంగా వెన్నతో అలంకరించనున్నట్లు ఆలయ కారనిర్వహణాధికారి నానాజీబాబు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున వచ్చి నవనీతోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

18 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గురువారం 18 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ధనంజయనాయుడు ఆధ్వర్యాన సబ్-ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె.అబ్దుల్ మారూఫ్, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ పిఆర్.బిశోయి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంలపై ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారం నెంబర్ -1 సమీపంలో ముంబయికి చెందిన సచిన్ శివాజీ కాలే గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం: బోయపాలెం బస్‌స్టాప్‌లో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి విశాఖ కెజిహెచ్ లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం బోయపాలెం బస్‌స్టాప్‌లో 45 - 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించిన ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్ 108కి సమాచారమిచ్చి కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు.దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చింతా వాసునాయుడు తెలిపారు.మృతుని ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

హిందీ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విగ్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థులకు హిందీ పుస్తకాలు ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ,విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల శత దినోత్సవ నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థులకు ఏదోవిధంగా సాయపడుతున్న ట్రస్ట్ ఛైర్మన్ శ్రీరామచంద్రమూర్తికి పాఠశాల హెచ్ఎం, పి రమణ, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు సతీష్, నానాజీ, రామకృష్ణ పాల్గొన్నారు

తర్లువాడలో సినిమా షూటింగ్ ప్రారంభం



సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్న స్టార్‌మేకర్ సత్యానంద్

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని తర్లువాడలో పాన్ ఇండియా సినిమా షూటింగ్‌ను స్టార్ మేకర్ లంక సత్యానంద్ ప్రారంభించారు తర్లువాడ వెంకటేశ్వరస్వామి కొండ సమీపంలోని రుణ విమోచన వినాయక గుడి ఎదుట ముహూర్తపు షాట్‌ను చిత్రీకరించారు. ఆర్ఎస్ సత్యనారాయణ రాజు నిర్మిస్తున్న సినిమాల హీరో రోహన్. డైరెక్టర్ వెంకట్. ఈ సందర్భంగా సత్యానంద్ మాట్లాడుతూ, గ్రామీణ వాతావరణ నేపథ్యమున్న ఇతివృత్తంతో సినిమా నిర్మిస్తుందున నెలరోజులపాటు ఆనందపురం పరిసర ప్రాంతాల్లోనే షూటింగ్ నిర్వహిస్తామన్నారు గంభీరం చందన హోటల్ లో చిత్రయూనిట్ బస చేశారు. ప్రారంభోత్సవంలో సినీ ప్రముఖులు అబ్దుల్ రజాక్, స్థానిక సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ఎంపిపి మజ్జి శారద ప్రియాంక, మజ్జి వెంకటరావు, బంకు రాజు, రమేష్ నాయుడు, పద్మనాభం ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు

జూ క్యూరేటర్‌గా మంగమ్మ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల పూర్తిస్థాయి క్యూరేటర్‌గా జి.మంగమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జూ అదనపు జూ క్యూరేటర్‌గా జి.మంగమ్మ విధులు నిర్వర్తించారు. పూర్తిస్థాయి క్యూరేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ఆరిలోవలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ, చివరి బస్‌స్టాపు వద్ద ఉత్తరాంధ్ర రాధా రంగా కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా నూతన విగ్రహాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ప్రతిష్ట నిర్వహించారు. వంగవీటి మోహన రంగ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రంగాఎంతో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్య సింహ, విశాఖ పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు, మూది అప్పారావు, ఆబోతుల అప్పలనాయుడు, మీసాల మురళీ మోహనరావు, బండి రాజా రమేష్ పాల్గొన్నారు.

సీతమ్మధార : వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా రాధా రంగ రాయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 44వ వార్డు అక్కయ్యపాలెం పార్కులో వంగవీటి మోహనరంగా విగ్రహాన్నిబిజెపి సభ్యులు శ్యామల దీపక్, సునీల్ టిడిపి సభ్యులు మౌర్యసింహ ఆవిష్కరించారు. మోహనరంగా విగ్రహ ప్రతిష్టకు కృషి చేసిన విచ్చేసి విగ్రహావిష్కరణ చేశారు వంగవీటి మోహన్ రంగ విగ్రహం విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా రాధా రంగ రాయల్ అసోసియేషన్ అధ్యక్షులు గాదే బాలాజీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు 500 మందికి అన్నసమారాధన చేశారు. స్థానిక కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, ఉషశ్రీ, శ్రీవాణి, భీశెట్టి వరలక్ష్మి, గాదే బాలాజీ, టి శ్రీనివాసరావు, గోవింద్, శివ గుడివాడ ప్రభాకర్, దినకర్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ కాపు వీధి లో గురువారం వంగవీటి రంగ వర్ధంతిని కాపు సామాజిక వర్గ నాయకులు , కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వంగవీటి రంగ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళు లర్పించారు. రంగా ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు మనం నిజమైన నివాళులర్పించినట్లు అని పలువురు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు వీధి యూత్ పాల్గొన్నారు.

వంగవీటి కలను పవన్‌కల్యాణ్ నిజం చేయాలి

ఎంవిపి కాలనీ : కాపుల హక్కుల కోసం పోరాటం చేస్తూ మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా కలను డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిజం చేయాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రియాంక దండి కోరారు. వంగవీటి మోహన్‌రంగా బతికి ఉంటే కాపుల రిజర్వేషన్ ఎప్పుడో వచ్చేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కాపుల రిజర్వేషన్ డిమాండ్‌పై కమిటీ వేసి సాధ్యమైనంత త్వరగా అమలు చేయించగలిగే స్థాయిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని, ఆయనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రాధాన్యత ఉన్నందున కాపులకు న్యాయం చేయాలని కోరారు.

వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలో గురువారం వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని రంగా అభిమానులు ఘనంగా నిర్వహించారు. వంగవీటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో దొండా నారాయణమూర్తి, దొండా నరేష్, గిరిబాబు, సయ్యపురెడ్డి జనార్ధన, వాసు, ఆది హరీష్, బొబ్బాది జగదీష్, బొబ్బాది సాయి, కోవెల వినయ్ కుమార్, సిరిగిరి శెట్టి దుర్గాప్రసాద్, దొండా లక్ష్మణ్, సయ్యపు రెడ్డి నాని, మణికంఠ పాల్గొన్నారు.

సిపిఎం మహాసభను జయప్రదం చేయండి

• పలుచోట్ల పోస్టర్లు, జెండావిష్కరణలు.. బైక్ ర్యాలీలు



పెందుర్తిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు, మహిళలు

ప్రజాశక్తి -గాజువాక : ఈనెల 28 29 తేదీల్లో, పెందుర్తిలో సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం నేత జిటివి ప్రకాష్ కోరారు. గురువారం భెల్ సిపిఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నేత ఎస్ జగన్నాధరావు, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిటివి ప్రకాష్ మాట్లాడుతూ, మూడేళ్లకోసారి జరిగే పార్టీ మహాసభల్లో, రానున్న మూడేళ్లకు భవిష్యత్ కార్యాచరణపై చర్చ, తీర్మానాలు, నిర్ణయాలు ఉంటాయన్నారు.ఐఎన్‌టియుసి నాయకులు, వి బాబురావు, సీతనాయుడు, వి ఆనందరావు పాల్గొని మద్దతు తెలిపారు. సిపిఎం నాయకులు కె.నారపరెడ్డి, ఎస్ అప్పారావు, పి శివరాం, గాజువాక జోన్ నాయకులు, పి వై రమణారావు, కె.కిరీటం పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పెదగంట్యాడ సిపిఎం కార్యాలయంలో పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు, స్టీల్‌జోన్ కమిటీ సభ్యులు. బైరెడ్డి గురప్ప ఆవిష్కరించారు. స్టీల్ జోన్ కమిటీ సభ్యులు డి వెంకటరావు మాట్లాడుతూ సిపిఎం బలపడితేనే కార్మిక హక్కులు,. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమన్నారు. స్టీల్ జోన్ కమిటీ సభ్యులు నమ్మి రమణ మాట్లాడుతూ. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రజలపై ధరలు, ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు నాయకులు జి శ్రీనివాసరావు, సిహెచ్ రాముడు, బి సింహాచలం బండి అప్పలరాజు, అంకం రెడ్డి శ్రీను, నమ్మి సన్యాసిరావు, నమ్మి చంద్ర రావు, హెచ్ భానోజీరావు పాల్గొన్నారు.

పెందుర్తి :సిపిఎం జిల్లా మహాసభల జయప్రదం కోరుతూ 95వ వార్డు జ్యోతినగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సిపిఎం నాయకురాలు బి అనంతలక్ష్మి మాట్లాడుతూ మహాసభల సందర్భంగా 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి సుజాతనగర్ వరకు మహాప్రదర్శన, అక్కడ బహిరంగ సభలో కష్టజీవులు,కార్మికులు, విద్యార్థి, యువజనులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి, పేదలకు ఇళ్లు, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల తగ్గింపు, పంచగ్రామాల భూసమస్య, 22ఏ భూ సమస్య పరిష్కారం 296, 388 జిఒల ప్రకారం పట్టాల రిజిస్ట్రేషన్, ఇతర అన్నివర్గాల సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు.

ఎంవిపి కాలనీ : సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన కళాభారతి వద్ద ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ శివాజీపాలెం, డాక్టర్స్ కాలనీ, వాల్తేరు, ఎంవిపి మీదుగా వెంకోజీపాలెం, ఇసుకతోట, భానూనగర్, సీతమ్మధార, మద్దిలపాలెం మీదుగా తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుంది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్రకుమార్, నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, ఎం.చంటి, జివిఎన్.చలపతి, అనపర్తి అప్పారావు, శివ పాల్గొన్నారు.

మధురవాడ : సిపిఎం విశాఖ జిల్లా 24 వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ కొమ్మాది కూడలి నుంచి మధురవాడ, కార్ షెడ్ మీదుగా తిరిగి కొమ్మాది వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డి అప్పలరాజు మాట్లాడుతూ ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు సిహెచ్ నరసింగరావు,మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సీనియర్ నేతలు కె.లోకనాథం,ఎం జగ్గునాయుడు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ర్యాలీలో ఎస్ రామప్పుడు, సి హెచ్ శేషుబాబు, జీ కిరణ్, జి.విజయ్, బి రాంబాబు, కె.నాగరాజు పాల్గొన్నారు

ఆరిలోవ: సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్ర కుమార్ జాతీయరహదారి పాత డెయిరీ ఫారం వద్ద ప్రారంభించారు. ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్ర నగర్, తోటగరువు, బాలాజీనగర్, టిఐసి పాయింట్ మీదుగా ఆరిలోవ చివరి బస్టాపు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకరరావు, డి.నాగరాజు, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భెల్ సిపిఎం నాయకులు



మద్దిలపాలెంలో బైక్ ర్యాలీ చేస్తున్న సిపిఎం నేతలు



ఆరిలోవలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న నరేంద్రకుమార్

ఎంబిఆర్ ట్రస్ట్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు.

ప్రజాశక్తి -గాజువాక : ఎంబిఆర్ ట్రస్ట్ నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, ఎంబిఆర్ ట్రస్ట్ స్థాపించి దాని వ్యవస్థాపక అధ్యక్షులుగా బాబూరావు కొనసాగుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ తమ చేతనైనంత సేవ చేయాలనే దానికి ఎంబిఆర్ ట్రస్ట్ బాబూరావు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మునగపాక బాబ్జీ, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీను, స్థానిక టిడిపి నాయకులు పులి రమణారెడ్డి, దానబోయిన అప్పలనాయుడు, మారుకొండ రాంబాబు, తాటికొండ సుదర్శన్, పంచదార ఉగ్రం పాల్గొన్నారు.

కాంట్రాక్టు వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి 6లోగా దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిషనర్ అఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌ఎం డైరెక్టర్ ఆదేశాలతో వైద్యఆరోగ్యశాఖలో మైక్రోబయోలజిస్ట్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, నిఖాస్ ఆపరేటర్, ల్యాబ్ అటెండెంట్, ఫార్మసిస్ట్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి జగదీశ్వర రావు ప్రకటనతో తెలిపారు. నేషనల్ టిబిఎండ్ ప్రోగ్రాం, నేషనల్ హెల్త్ మిషన్‌లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు cfw.ap.nic.in వెబ్‌సైటులో ఉంచారని, వచ్చేనెల 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు దాటిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించబోమన్నారు. అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌దే

ప్రజాశక్తి -గోపాలపట్నం : విజన్ ఉన్న నేత చంద్రబాబు పాలనలో గతంలో ఏనాడూ విద్యుత్ ఛార్జీలను పెంచలేదని పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. ప్రస్తుతం కరెంటు ఛార్జీల భారానికి గత ప్రభుత్వ విధానాలు, నాటి సిఎం జగనే కారణమని ఎద్దేవా చేశారు. వినియోగదారులపై విద్యుత్ భారాలకు కారణమైన జగన్ అసెంబ్లీకి హాజరుకాకుండా,. ఇపుడు పోరుబాట పేరుతో డ్రామాలాడుతున్నారన్నారు.విశాఖకు సినీ పరిశ్రమలు రావాలి కోరుకుంటున్నామన్నారు. బెనిఫిట్ షోలు టికెట్ ధర పెంపు విషయంపై ముఖ్యమంత్రితో సమావేశమై చర్చిస్తామన్నారు.

టిటి ఛాంపియన్‌గా గీతం జట్టు



ఛాంపియన్ షిప్ అందుకుంటున్న గీతం విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ :కాకినాడలోని శ్రీప్రకాశ్ సినర్జి విద్యాలయంలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ (పురుషుల) పోటీలలో గీతం విశ్వవిద్యాలయం క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచి ఛాంపియన్ షిప్‌ను కైవశం చేసుకున్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో గీతం న్యాయ కళాశాల విద్యార్థి సూర్యతేజ ప్రథమ స్థానంలో నిలవగా, పిజి విద్యార్థులు రోహిత్‌హల్దర్, కుశాల్‌దాస్ రెండు, మూడు స్థానాలలో నిలిచారు. అలాగే బిబిఎ విద్యార్థి ప్రగ్యాన్ అండర్-19 విభాగంలో కాంస్య పతకం సాధించారు. దీంతో గీతం టేబుల్ టెన్నిస్ పురుషుల జట్టుకు ఛాంపియన్ షిప్ వరించింది. విజేతలను గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ అభినందించారు.

87వ రోజుకు పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పద్మనాభరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పిపిపి విధానంలో అభివృద్ధి పేరుతో పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుపరం చేయాలన్న ఆలోచన విరమించే వరకు పోరాటం కొనసాగిస్తామని అఖిలపక్ష పోర్టు కార్మికులు, ఉద్యోగులు స్పష్టం చేశారు. గురువారం సిఐటియు పోర్టు డిఎల్‌బి కార్మిక సంఘాల ఆధ్వర్యాన 87వ రోజు దీక్షల్లో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వివిఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ, పోర్టుఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం పేరుతో బూటకపు మాటలు చెప్పి పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుకు కట్టబెట్టాలనుకోవడం దారుణమన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటు పరమైతే కార్మికులకు వైద్యం దూరమవ్వడం ఖాయమన్నారు. ఏటా వందల కోట్లు లాభాలను ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యం, ఆసుపత్రి అభివృద్ధిని ప్రయివేటుకు అప్పగించాలనుకోవడం మానుకోవాలన్నారు. పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేయడంతోపాటు వైద్యనిపుణులు, ఆధునాతన వైద్యపరికరాలను సమకూర్చి వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. దీక్షల్లో యూనియన్ అధ్యక్షులు జక్కాన సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పూరుకూటి రామలింగేశ్వరరావు, వివిఎన్ మూర్తి, కొల్లాబత్తుల విజయకుమార్, నర్సింగ్, శ్రీనివాస్,. కోన సత్యనారాయణ, డీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'పరీక్ష పే చర్చ'కు ప్రశ్నలు పంపండి

ప్రజాశక్తి -మధురవాడ : పరీక్ష పే చర్చలో పాల్గొనేందుకు ప్రధాని మోడీకి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రశ్నలు పంపించాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి సూచించారు. గురువారం పాఠశాలలో పరీక్ష పే చర్చ 2025 ప్రచార పోస్టర్లనుఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులతోపాటు ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రులు మొబైల్ ఫోనులో పరీక్ష పే చర్చలో రిజిస్టర్ అయ్యి పరీక్షలపై ప్రశ్నలను పంపించాలన్నారు. విద్యార్థులు పరీక్షలలో తాము అవలంబిస్తున్న విధానాలు, పరీక్షల సంస్కరణలు, ఒత్తిడి నివారణ, కష్టతరమైన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంలో ఇబ్బందులు తదితర అంశాలపై ప్రశ్నలను పంపవచ్చన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద తల్లిదండ్రులతో మొబైల్ ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేయించి వారి ద్వారా ప్రశ్నలను పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, నాగేశ్వర రావు, కె శ్రీను, విజయకుమార్, సూర్యకుమారి పాల్గొన్నారు.

ఒప్పంద హామీలను అమలు చేయాలి

• జివిఎంసి పారిశుధ్య కార్మికుల ధర్నా



జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- గాజువాక : గతేడాది సమ్మె సమయంలో డిసెంబర్ 26న అప్పటి ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రాతపూర్వకంగా ఇచ్చిన ఒప్పంద హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ జివిఎంసి కాంట్రాక్టువర్కర్స్ యూనియన్, సిఐటియు. ఆధ్వర్యంలో స్థానిక జోనల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రెటరీ గొలగాని అప్పారావు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబానికి సాదారణ మరణానికి పరిహారాన్ని రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని, 12 పిఆర్‌సి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్ జిఒలు విడుదల చేయాలని కోరారు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘీభావంగా వచ్చేనెల 3న ఇంజనీరింగ్ కార్మికులు, 10న మిగిలిన సెక్షన్లు కార్మికులు రిలేదీక్షలు చేస్తారన్నారు.. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే, సంక్రాంతి తర్వాత దేశవ్యాప్త సమ్మె తప్పదని హెచ్చరించారు. ధర్నాలో. గొల్ల రాము, నక్క నాగరాజు, కెవిపిఎస్ గాజువాక సెక్రెటరీ సోమాదుల గణేష్, బంగారు నాయుడు, సత్యం, మంగ, దివ్య పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని

ఆర్‌డిఒ ఆఫీసు వద్ద ముఠా కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణ ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ ముఠా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం స్థానిక కాయగూరల మార్కెట్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ముఠా కార్మికులకు న్యాయమైన కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలని నోటీసు ఇచ్చి 22 రోజులైందని, షాపుల యజమానులు కూలి రేట్లు 13 శాతం పెంచుతామని చెప్పడం సరైనది కాదని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే మూడు దఫాలుగా చర్చలు చేశారని, కనీసం కూలిరేటు పెంచడానికి షాపు యజమానులు సిద్ధంగా లేరని, ఇది ఎంతవరకు సబబువని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూలి రేట్లు 50శాతం పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం, ఖర్చులు 200శాతం పెరుగుతున్నాయని, దాని తగ్గ కూలి పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ముఠా కార్మికులు తమ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి బస్తాలు మోస్తున్నారని, కార్మికులు ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే యజమానులు చర్చలు చేసి కూలి రేట్లు పెంచాలని, అంతవరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కాళ్ల తేలయ్యబాబు, పార్సిల్ యూనియన్ అధ్యక్షులు బోడి రాజు, కనకాల అప్పలరాజు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భీశెట్టి అప్పారావు, తిర్రి సురేష్, కాపుశెట్టి అప్పారావు, మహలక్ష్మి నాయుడు, అధిక సంఖ్యలో ముఠా కార్మికులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు


ఆర్థిక సాయం పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కొరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంచి ప్రతిభ చూపించిన 10 మంది విద్యార్థులకు ఉల్లాస్ సంస్థ ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం చెక్కుల ద్వారా గురువారం అందజేశారు. కొరువాడ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉల్లాస్ ప్రతినిధి మహేష్ మాట్లాడుతూ విద్యలో రాణించడంతో పాటు విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండి మన దేశానికి కుటుంబానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన దేశభక్తులను, నాయకులను, క్రీడల్లో రాణించిన ఉత్తమ క్రీడాకారుల చిత్రపటాలను స్లైడ్స్ ఐఎఫ్‌పి ప్యానెల్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కమల కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : క్రిస్మస్ పండగను పురస్కరించుకొని పట్టణంలో వివిధ ప్రాంతాలలో చలిలో వణుకుతూ జీవనాన్ని సాగిస్తున్న నిరాశ్రయులు, అనాధలు, అభాగ్యులు, మతిస్థిమితం లేని వారికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఎవరూ లేక యాచకులుగా రోడ్లపైన, ఫుట్ పాత్, రైల్వేస్టేషన్, బస్ స్టేషన్ , దుఖాణముల వరండాలు, దేవాలయ ప్రాంగణాలలో దుర్భర జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వము మానవతా దృక్పథంతో ఇటువంటి నిర్భాగ్యులకు అన్ని పట్టణ కేంద్రాలలో విశ్రాంత ఆశ్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వినకోట నిలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి బల్ల శ్రీనివాసరావు, నక్కిన శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : భూ ఆక్రమణలపై దృష్టి సారించాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు రెవెన్యూ అధికారులకు సూచించారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కోన సంధ్య అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావును ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఆక్రమణలు చోటుచేసుకుంటున్నా వీఆర్వోలు, సంబంధిత రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు సభలో పలు ప్రశ్నలను లేవనెత్తారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, కో జడ్పీటీసీ సభ్యుడు నర్మల కుమార్, ఎంపీడీవో ప్రభాకర్‌రావు తాసిల్దార్ జివి జనార్దన్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌ను అనకాపల్లి ఎస్‌పి తుహిన్ సిన్హా గురువారం తనిఖీ చేసారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావును సిబ్బంది వివరాలు, కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మండలంలో గల గ్రామాల్లో ముఖ్య స్థలాలు, ఆలయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

31 వరకు ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ తత్కాల్ ఫీజుతో ఈనెల 26 నుంచి 31 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ అడ్మిషన్ ఫీజుకు అదనంగా తత్కాల్ ఫీజు 600 రూపాయలు చెల్లించి సత్వరం ప్రవేశం పొందాలన్నారు. ఇతర వివరాలకు సమీపంలో ఏపీ ఓఎస్ఎస్ స్టడీ సెంటర్ లేదా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్షకు తత్కాల్ ఫీజుతో గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : 10వ తరగతి చదువుతూ 2025 మార్చిలో జరిగే పరీక్షలకు సకాలంలో ఫీజు చెల్లించని విద్యార్థుల అభ్యర్థన మేరకు తత్కాల్ అవకాశం కల్పించినట్టు జిల్లా విద్య శాఖ అధికారి జి అప్పారావు నాయుడు తెలిపారు. వెయ్యి రూపాయలు ఆలస్య రుసుముతో ఈనెల 27 నుంచి 2025 జనవరి 10వ తేదీ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'విద్యాశాఖలో మార్పులు తెచ్చిన లోకేష్'

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి పాలనలో నూతన విద్యా విధానం పేరుతో నాశనం చేసిన వ్యవస్థను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ ఘననీయమైన మార్పులు తీసుకువచ్చి ప్రగతిని సాధించారని టిడిపి అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు అన్నారు. స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా పుస్తకాలు బ్యాగులు, మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలను గౌరవించే విధంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

దేవాదాయ భూములను రక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 115లో కోట్లాది రూపాయలు విలువ చేసే 23.15 ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాదాయశాఖ అధికారులు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ భూములను పూర్వం మారేపల్లి గ్రామానికి చెందిన అవుగడ్డ సఖారి నాయుడు శ్రీరాములు వారి దేవస్థానానికి దానం చేయగా, 1956లో సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్‌లో శ్రీరాములు వారి పేరు నమోదైందని తెలిపారు. అయితే అదే ఎస్‌ఎఫ్‌ఎల్‌లో రెండో పేరుగా అల్లు గౌరునాయుడు పేరు రాసుకొని అప్పటికే ఆ భూములను శిస్తుకు దున్నుతున్న తరువ గ్రామానికి చెందిన రైతులు 1999లో విశాఖ మున్సిఫ్ సివిల్ జడ్జి కోర్టులో కేసు వేశారని పేర్కొన్నారు. కోర్టు దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ రైతులు తప్పుడు రికార్డులు సృష్టించి కవిత అగ్రిఫామ్ యాజమాన్యానికి అమ్మకాలు చేశారని వెల్లడించారు. దీనిపై సిపిఎం రెండేళ్లగా దశల వారీగా చేసిన పోరాట ఫలితంగా స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు కవిత అగ్రిఫామ్ యాజమాన్యం వెంచర్ వేసిన భూములు అమ్మకాలు కొనుగోలు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. దీనిపై కవిత అగ్రిఫామ్ యాజమాన్యం 2023 అక్టోబర్ 10న హైకోర్టులో పిల్ వేయగా, దీనిపై దేవాదాయ శాఖ అధికారులు కూడా కోర్టులో కౌంటర్ వేశారని పేర్కొన్నారు. కవిత అగ్రిఫామ్ యాజమాన్యం హైకోర్టును ప్రభావితం చేసే విధంగా పైరవీలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైకోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఈ భూములు దేవాదాయ శాఖ స్వాధీనంలోకి తీసుకొని బోర్డులు ఏర్పాటు చేసి ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించాలని వెంకన్న దేవాదాయశాఖ అధికారులను కోరారు.

ఎస్సీ కుల విభజన సర్వేపై 31 వరకు అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : ఎస్సీ కుల విభజన సర్వేపై ఈ నెల 31 వరకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందని స్థానిక ఎంపీడీఓ పి.పద్మజ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కుల సర్వేపై ఎటువంటి తప్పులు ఉన్నా, కులం తప్పు పడినా, పేరు తప్పు పడినా వెంటనే సంబంధిత సచివాలయంలో అర్జీలు ఈ నెల 31లోగా పెట్టుకోవాలని సూచించారు. గ్రామ వీఆర్వో లాగిన్‌లో అర్జీలను ఎంట్రీ చేసి ఆర్ఐకు పంపిస్తారని, తర్వాత తహసీల్దార్ లాగిన్‌కు అర్జీని పంపిస్తారని తెలిపారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే ఆర్డీఓ లాగిన్‌కు అర్జీ పంపడం జరుగుతుందని, అందువలన ఎస్సీలు అర్జీలు చేసుకోవాలని సూచించారు. అర్జీలను జనవరి 6 వరకు దర్యాప్తు చేసి జనవరి 10న ఆయా సచివాలయంలలో జాబితాలు ఉంచడం జరుగుతుందని తెలిపారు.

కుంగుతున్న ప్రధాన రహదారి

- పలు చోట్ల రోడ్డు మధ్య వరకు పెచ్చులూడిన వైనం
- నిర్మాణం జరిగిన కొన్ని నెలలకే శిథిలం

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి-అచ్యుతాపురం ప్రధాన రహదారిలో పలు ప్రాంతాల్లో రోడ్డు క్రుంగిపోతోంది. నిర్మాణం జరిగిన కొన్ని నెలలకే రోడ్డు మధ్య వరకు పెచ్చులూడి శిథిలమైంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరి గుంతలు పడటంతో పలు ప్రమాదాలు చోటుచేసుకొని పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన పలు ఆందోళనలు చేసిన నేపథ్యంలో నాటి ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.7 కోట్లతో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేసింది. అయితే రోడ్డు నిర్మాణం జరిగి నెలల వ్యవధిలోనే పలు ప్రాంతాలలో రహదారి క్రుంగిపోయి బీటలు వారుతోంది. మునగపాక మెయిన్ రోడ్ చర్చి సమీపంలో రోడ్డు సగానికి పైగా క్రుంగిపోయి, పెచ్చులూడిపోయాయి. క్రుంగిన ప్రాంతంలో మరమ్మతులు చేయకపోగా ఇరువైపులా రాళ్ల మూటలు పెట్టారు. దీంతో సింగిల్ వే కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో పలు కంపెనీల బస్సులు, లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు మధ్య వరకు శిథిలమైన ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి వస్తోంది. రాత్రి సమయంలో ఈ సమస్య మరింత జటిలంగా మారడంతో సుదూరంగా వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. తక్షణమే సంబంధిత అధికారులు దీనిపై స్పందించి సత్వర చర్యలు తీసుకొని రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుకుంటున్నారు.


చర్చి సమీపంలో రోడ్డు సగం వరకు కుంగిపోయి దృశ్యం

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపుపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దారు బి.చిన్నికృష్ణ పేర్కొన్నారు. గ్రావెల్ మాఫియాకు చెక్ పెట్టేందుకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ అధ్యక్షతన గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో స్థానిక సిఐ పిన్నింటి రమణ, మైనింగ్ రాయల్టీ ఆర్ఐ బండారు శ్రీనివాస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నికృష్ణ మాట్లాడుతూ మండలంలో గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు, గొల్లలపాలెం, పైడివాడ, ఎరుకునాయుడు పాలెం, అసకపల్లి, గాలిభీమవరం, బోదువలస, వంగలి పరిసర ప్రాంతాల్లో కొండల్లోనూ, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గంగవరం సర్వే నెంబర్ 58, 59 లలో ప్రతిరోజు గ్రావెల్ తవ్వి తరలిస్తున్నట్లు, గ్రావెల్ స్టాక్ పాయింట్‌ల నుండి అగనంపూడి, గాజువాక, పరవాడ తలిస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సిఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ తాము రాత్రి వేళల్లో పలు వాహనాలను పట్టుకొని మైనింగ్, రెవిన్యూ అధికారులకు అప్పగించి జరిమానాలు విధించడం జరుగుతుందని చెప్పారు. సమన్వయ కమిటీ రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గ్రావెల్ అక్రమార్కులను పట్టుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మైనింగ్ రాయల్టీ ఆర్ఐ బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి క్వారీలకు మైనింగ్ శాఖ నుండి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఇకపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గ్రావెల్ మాఫియాను అంతమొందిస్తామని హెచ్చరించారు.



సమావేశంలో పాల్గొన్న సిఐ, తహశీల్దారు, మైనింగ్ ఆర్ఐ

సచివాలయాల్లో కుల గణన జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఎస్సీల జనాభా వివరాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ కులగణన వివరాలు పంచాయతీల వారీగా గురువారం మండలంలోని అన్ని సచివాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచారు. వీటిపై అభ్యంతరాలను ఈనెల 31వ తేదీ వరకు స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను జనవరి 6 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాలను జనవరి 10న గ్రామ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచడం జరుగుతుందని చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, కార్యదర్శి సురేష్ బాబు గురువారం విలేకరులకు తెలిపారు. చౌడువాడ పంచాయతీ పరిధిలో 267 ఎస్సీ కులస్తులు ఉన్నారని, వారి జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ జాబితాలో వారి విద్యార్హతలు, వయస్సు, ఆధార్ వివరాలు, వ్యవసాయం, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి సౌకర్యం మొదలైన వివరాలు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. చౌడువాడలో జాబితా ప్రదర్శనలో గ్రామం పెద్దలు కుంచ అంజిబాబు, తనకల అప్పలనాయుడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కెరీర్‌పై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విద్యార్థుల డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, కెరీర్‌పై దృష్టి సారించాలని బుచ్చయ్యపేట అదనపు ఎస్సై ఎన్ భాస్కరరావు అన్నారు. సంకల్పం ప్రోగ్రాంలో భాగంగా గురువారం సీతయ్యపేట జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలు వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ కు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.విష్ణు, ఇంగ్లీష్ టీచర్ దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మల్లవరం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని డెయిరీ మేనేజర్ కె.శేషు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు 2025 సంవత్సరం క్యాలెండర్‌లు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి గోవిందు, హెచ్‌పిఆర్ఎస్ నరసింహారావు, ఆర్ పార్వతి, ఏ లక్ష్మి, పి రామ నాయుడు, ఏ ప్రసన్న పాల్గొన్నారు.

నేడు అచ్యుతాపురం మండలంలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డివిజన్ పరిధిలో అచ్యుతాపురం మండలంలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెయింటినెన్స్ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అచ్యుతాపురం, రామన్నపాలెం, మూసయ్యపేట, చోడపల్లి, ఆవసోమవరం, అవరాజాం, చీమలాపల్లి, అప్పన్నపాలెం, బంగారయ్యపాలెం, జేపీఅగ్రహారం, నారపాక, దుప్పితూరు, కోనెంపాలెం, కుమారపురం, భోగాపురం, దిబ్బపాలెం, వెదురువాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట గ్రామం గవరపేట వీధిలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాను ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు బీశెట్టి కుమార్, వివిఎస్.నాయుడు, దాడి నాగరాజు, దాడి కృష్ణ, వేగి సాయి, ప్రజలు పాల్గొన్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. బుచ్చయ్యపేటలోని జాజిమొగ్గల హైస్కూల్‌ని గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. నాలెడ్జి అన్నిటికంటే విలువైనదని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. రాజ్యాంగం, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఏ శ్రీనివాసరావు, స్కూల్ కరస్పాండెంట్ జాజిమొగ్గల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశంలో విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి

చండీగఢ్ కార్మికుల పోరాటానికి సంఘీభావం



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని, దానిని తక్షణమే ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చండీగఢ్ రాష్ట్రంలో డిస్కమ్‌లు ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఇక్కడి విద్యుత్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా గురువారం అనకాపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ చండీగఢ్‌లో కార్మికులు అనేక పోరాటాలు చేస్తుంటే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం యస్మాను ప్రయోగించి ఉద్యమాన్ని అణిచివేస్తుందని పేర్కొన్నారు చండీగఢ్ రాష్ట్రంలో వలే ఆంధ్ర రాష్ట్రంలో కూడా విద్యుత్ సంస్కరణలు పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చూస్తుందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, రాజు, బి.రాజు, కళ్యాణం, సురేష్, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సముద్ర తీరంలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

వేట నిషేధ పరిహారం చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వేట నిషేధ పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పూడిమడక సముద్రంలో మత్స్యకారులు నీటిలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు చేపల తాతయ్య, సిహెచ్ గంగరాజు, సిహెచ్ శివాజీ మాట్లాడుతూ వేట నిషేధ కాలం పూర్తయి ఎనిమిది నెలలు కావస్తున్నా మత్స్యకారులకు నేటి వరకు పరిహారం చెల్లించకపోవడం విచారకరమన్నారు. వేట నిషేధ కాలంలో కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చుకోలేక ఆర్థిక పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.20వేలు చొప్పున పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.కాశి, సిహెచ్ పెంటయ్య, సిఐటియు మండల కన్వీనర్ సోమనాయుడు, వి చిన్నయ్య, తాత, వి.కోదండరావు, ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి సమీపంలోని ఉన్న అతి పురాతనమైన సత్యనారాయణమూర్తి ఆలయానికి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. అస్తవ్యస్తంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణం కోసం జెసిబితో ఎర్త్ వర్క్ పనులు గురువారం జరిగాయి. ఈ పనులను దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పరిశీలించారు. ఎట్టకేలకు ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెదనందిపల్లి మాజీ సర్పంచ్ రామలింగేశ్వర స్వామి, చిననందిపల్లి మాజీ సర్పంచ్ పూడి సత్యారావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, చిననందిపల్లి శ్రీను, అల్లు శ్రీను, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనుల పరిశీలనకు వచ్చిన మాజీ ఎంపిపి

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు రొంగలి రాములు విరాళం అందజేశారు. శివాలయం స్టీల్ గేటు నిర్మాణానికి రూ.60,116, కంచు గంటకు రూ.18 వేలు బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, రొంగలి సత్తిబాబు (ఇంజనీర్), ఎం.కనకరాజు, పెన్నం శ్రీనివాసరావు , కొల్లి గంగునాయుడు, కామిరెడ్డి దేముడు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల బాదుడుపై

నేటి నిరసనలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ ఛార్జీల బాదుడుపై మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న జరుగు పోరుబాట నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పోరుబాట పోస్టర్‌ను స్థానిక రింగ్ రోడ్డు వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు పెంచబోనని, అవసరమైతే తగిస్తానంటూ బూటకపు హామీలు గుప్పించిన చంద్రబాబు నేడు భారీగా విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, మలసాల కిషోర్, బుల్లిబాబు, కెఎం నాయుడు, కోరుకొండ రాఘవ, పెద్దిశెట్టి గోవింద్, దాడి నారాయణరావు, పీడి గాంధీ, గైపూరి రాజు, బీశెట్టి జగన్, వేగి త్రినాధ్, కాంద్రేగుల రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : కరెంట్ ఛార్జీల బాదుడుపై నిరసన తెలియజేసేందుకు నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం 17వేల కోట్ల రూపాయలు విద్యుత్తు భారాన్ని వేసిందన్నారు. ఈ మేరకు నియోజక వర్గం కేంద్రంలో ఈనెల 27న ప్రభుత్వ వైఖరికి చేపట్టనున్న నిరసనకు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు.

రావికమతం : పెంచిన విద్యుత్తు చార్జీలు తగ్గించాలని ఈనెల 27న చోడవరం నియోజకవర్గం బుచ్చయ్యపేట మండలం వడ్డాది సబ్ స్టేషన్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి మండలంలోని పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావికమతం వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మి నాయుడు కోరారు. మండలంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎంవిపి కాలనీ : విద్యుత్ భారం తగ్గించాలని ప్రతి నియోజకవర్గంలోనూ విద్యుత్ కార్యాలయాల వద్ద శుక్రవారం నిరసనలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి తెలిపారు. గురువారం ఆమె క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు కేవలం 6 నెలల్లో రూ.15,500 కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజల మీద మోపారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయడం లేదు సరికదా పేద మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరిచేలా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. నిరసన కార్యక్రమాల్లో వైసిపి నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఎస్.రాయవరంలో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: గ్రామాలలో రెవెన్యూ శాఖలో పేరుకు పోయిన భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్ధారు జె రమేష్ బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ,నిషేధిత జాబితాలో నమోదయిన రైతాంగ భూముల తొలగింపు, మ్యుటేషన్లు, ఇతర సమస్యలపై రెవెన్యూ సదస్సులలో అర్జీలు స్వీకరిస్తారన్నారు. ధరఖాస్తులను సమగ్ర పరిశీలన అనంతరం సత్వరంగా పరిష్కారం చేస్తామన్నారు. భూమి డాక్యుమెంట్లు ఉండి ఆన్ లైన్ కానివారు, పాసుపుస్తకంకు ధరఖాస్తులు, ప్రభుత్వ భూములుగా నమోదయిన రైతు భూములు వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో నూకరాజు, సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపిటిసి బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపిటిసి కొణతాల శ్రీనువాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ నరసింహామూర్తి అన్నారు. మండలంలోని గురువారం న్యాయంపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలను తమ దష్టికి తీసుకువస్తే, సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పలువురు పలు సమస్యలపై అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు, ఎంపీటీసీ సభ్యులు గోవిందరావు, ఆర్ఐ కన్నబాబు, సర్వేయర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:రెవిన్యూ సదస్సులను భూ సమస్యలు ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగన్నదొరపాలెం, పొగచెట్లపాలెం గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
భూ సమస్యలను రైతులంతా సదస్సుల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే సత్వార్వపరిష్కారాన్ని చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, మండల సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వోలు అప్పారావు, గోవర్ధన్, టిడిపి నాయకులు బెల్లపు కొండలరావు, మోహన్, పప్పిశెట్టిపాలెం పంచాయతీ ఉపసర్పంచ్ ఎం.వరహాలు బాబు పలువు రైతులు పాల్గొన్నారు.

కోటవురట్ల, సమస్యల పరిష్కారానికి సదస్సులు.. రెవిన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాహసిల్దారు తిరుమల బాబు గురువారం రాజుపేట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అన్నారు, సందర్భంగా ఆయన పలు ఫిర్యాదులను పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు, కార్యక్రమంలో ఆర్ ఐ ఊర్ధపరావు, గ్రామ రెవెన్యూ సంఘ అధ్యక్షులు రమేష్, గ్రామ రెవెన్యూ అధికారి అనూష సిబ్బంది పాల్గొన్నారు.



సబ్బవరంలో



గొలుగొండలో....

సబ్బవరం : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం అవుతాయని తహశీల్దార్ బి. చిన్నకృష్ణ అన్నారు. మండలంలోని అమృతపురం, తవ్వవానిపాలెం రెవెన్యూ గ్రామాలలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 5 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, అమృతపురం సర్పంచ్ బైలిపూడి గౌరీ రామారావు, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఎంపీటీసీలు బోకం బాలకృష్ణ, సింగంపల్లి శ్రీనివాసరావు, వెన్నెల నరేష్, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వోలు పి.జగన్నాధరావు, ఈ.రాంబాబు, విలేజ్ సర్వేర్లు ఆదిత్య, ధనశేఖర్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : భూవివాదాల పరిష్కారంతోపాటు రికార్డుల్లో తప్పుల సవరణకు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుధా సాగర్ కోరారు కోరాడ గ్రామంలో రెవెన్యూ సదస్సును పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సమగ్ర భూరీసర్వేలో భూములు వివరాలు తప్పుడుగా నమోదయ్యాయని, వాటిని పరిష్క గ్రామానికి చెందిన గద్దె ఎర్నాయుడు. కోరాడ రామస్వామి, లక్ష్మణరావు., సూర్యారావు, ప్రసాదు, శ్రీను తదితర రైతులు కోరారు. సదస్సులో తహశీల్దార్ కె. ఆనందరావు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కనకబాబు. మండల సర్వేయర్ రామకృష్ణ, విఆర్ఒ ప్రవల్లిక పాల్గొన్నారు.

28న కోటవురట్ల మండల సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 28న శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు కానున్నందున స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు హాజరై ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. సభ్యులు అందరూ సకాలంలో హాజరు కావాలన్నారు.

29న మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఈనెల 29న మండలంలో చెట్టుపల్లిలో రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే రెల్లి మహాసభను జయప్రదం చేయాలని గురువారం రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రం శెట్టి పాపారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే జిల్లా మహాసభకు జిల్లాలో ఉన్న అన్ని మండలాల గ్రామ రెల్లి నాయకులు, కార్యకర్తలు రెల్లి మహిళలు అందరూ మహాసభను జయప్రదం చేయాలని పాపారావు పిలుపునిచ్చారు. రెల్లి కులస్తులకు రిజర్వేషన్లు వాటా 5 శాతం పెంచాలన్నారు. విద్యా ఉపాధి ఆర్థిక సంక్షేమ రంగాలలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు.

సిపిఐ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలో గబ్బాడ గ్రామంలో గురువారం ఆ పార్టీ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ కార్యదర్శి నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు గురు బాబు, డిసిహెచ్ క్రాంతి, సీనియర్ నాయకులు పి గంగాభవాని పాల్గొన్నారు.

రావికమతం: సిపిఐ శత జయంతి ఉత్సవాలను మండలంలో పొర్లపాలెంలో మండల కార్యదర్శి జోగిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు శివలంక కొండలరావు హాజరయ్యారు. మండల కార్యదర్శి జోగిరాజులు, వెంగలి ఈశ్వరరావు, కొండపల్లి శ్రీను, వెంగలి అప్పన్న, కొండబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: సీపీఐ ఆవిర్భావ దినోత్సవం గొలుగొండలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ మేకా సత్యనారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు జి.గురుబాబు, డిసిహెచ్.క్రాంతి, మేకా భాస్కర్ రావు, జి.రాధాకృష్ణ, పి.లోవరాజు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలేపల్లి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని చెప్పారు. పార్టీ నాయకులు సన్యాసిరావు, కన్నబాబు, సత్తిబాబు, ఫణీంద్ర, త్రినాధ్, వియ్యపు రాజు, బాబ్జి, రాజు, వీరాచారి, శంకర్రావు, తాకాసి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చియపేట మండలం వడ్డాదిలో కళాశీల సంఘం ఆధ్వర్యంలో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు వర్రి రాము పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, రావాడ వరహాలు, రాము, కొండబాబు, వర్రి సూరిబాబు, దాసరి రాము, పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : సిపిఐ శత వార్షికోత్సవాల ప్రారంభం సందర్భంగా బీచ్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఆర్కె.బీచ్ వరకు పార్టీ కార్యకర్తలు గురువారం ఎర్ర కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్తులో భారత దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం కాపాడేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిహెచ్.రాఘవేంద్రరావు, నాయకులు సభ్యుడు ఎజె స్టాలిన్, ఎం.పైడిరాజు, జిఎస్జె.అచ్యుతరావు, ఎ.విమల, ఎస్కె.రహమాన్, కె.సత్యాంజనేయ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా సిపిఐ కార్యాలయం మేడపై గురువారం పార్టీ పతాకాన్ని రాఘవేంద్ర రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, ఎం.పైడిరాజు, అత్తిలి విమల పాల్గొన్నారు.

సెంట్రల్ పార్క్ చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం వద్ద జెండాను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రెహిమాన్, ఎం.మన్మధరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.రాము, ఎస్.నగేష్, అప్పారావు, ఎమ్డి.సాహిత్, టి.రవి, ఎస్.బాబ్జి పాల్గొన్నారు.

తగరపువలస :సిపిఐ శత జయంతోత్సవాల్లో భాగంగా గురువారం పార్టీ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యంలో జి ఆర్ భవన్, చిట్టివలస, కొత్తపేట, కొండపేట ప్రాంతాల్లో పార్టీ పతాకావిష్కరణలు జరిగాయి. పార్టీ నాయకులు అల్లు బాబూరావు, ఎం సన్యాసమ్మ, కానూరు రాంబాబు, ఎన్ ఆదినారాయణ, ఎం అప్పలరాజు పాల్గొన్నారు

మధురవాడ : సిపిఐ శతజయంతోత్సవాల్లో భాగంగా మధురవాడ పార్టీ కార్యాలయం వద్ద ఏరియా సమితి కార్యదర్శి వి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో మధురవాడ ఏరియా సిపిఐ నాయకులు. కె.జగ్గస్వామి, త్రినాధ్, పి.రమణ ముఠా కళాసీల మేస్త్రి బంగారయ్య, అప్పలరాజు సోములు, రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్నఎంపిడిఒ

ఇకెవైసి నమోదు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం ఖాతాదారులు (రైతులకు) ఈ కేవైసీ నమోదు చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని చినదొడ్డిగల్లు సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సేవలపై ఆరా తీశారు. ఈ సర్వీసెస్ అమౌంట్ జమ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఇన్చార్జ్ ఈ ఓ పి ఆర్ డి ఎం శ్రీను, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

దంత వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో నూతన దంతవైద్యశాలను టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం గురువారం ప్రారంభించారు. అడ్డురోడ్డు రామకోటి కాంప్లెక్స్లో మూర్తి దంత వైద్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. అంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజలు దంత సమస్యలతో తుని, యలమంచిలి, అనకాపల్లి, విశాఖ ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుందన్నారు. రేవుపోలవరానికి చెందిన వైద్యులు నర్సింహమూర్తి చే దంత వైద్యశాల ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి గుర్రం రామకృష్ణ, నాయకులు తుంపాల నాగేశ్వరరావు, నల్లపరాజు వెంకటరాజు, పల్లేల జగ్గారావు, కురందాసు శ్రీనువాసరావు, కోడ లోవరాజు, వంగలపూడి గోవిందరావు, కట్టా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురంలో శుక్రవారం హెూం మంత్రి వంగలపూడి అనిత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, హెూం మంత్రి అనిత ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అనంతరం రైతులతో ముఖాముఖిలో అనిత పాల్గొంటారని తెలియజేశారు. కూటమి నాయకులందరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి :తుఫాన్ కారణంగా వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం రాజేష్ కోరారు. మండలంలోని ఉపమాక రెవెన్యూ పరిధిలో మనబాలవానిపాలెంలో తుఫాను, అకాల వర్షం కారణంగా మునిగి పోయిన వరి పొలాలను పరిశీలించారు. మనబాలవానిపాలెం గ్రామానికి చెందిన మనబాల సత్యనారాయణ, గొర్ల సత్తిబాబు, కొలిబోయిన శివ, నక్కపల్లికి చెందిన కశింకోట లక్ష్మణరావు, అంజి తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, వరి పంట చేతికందే సమయంలో అకాల వర్షానికి నీటి ముంపును గురై తీవ్ర నష్టం వాటిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా వరి పంట మునిగి పోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వెంటనే ప్రభుత్వం స్పందించి ఆదుకునేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, తడిచిన, రంగు మారినా, ముక్కిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాకు రెండు వేల మూడు వందల ఇరవై రూపాయలు చొప్పున కొనుగోలు చేయాలన్నారు. కుప్పలు తడిచి పోకుండా రైతులందరికీ టార్పాన్ లు ఇవ్వాలని,రైతులు ధ్యానాన్ని నింపడానికి జూట్ సంచులు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పంట పండిస్తున్న రైతులను ఆదుకోవడానికి వెంటనే రైతు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, రైతులు మనబాల సత్యనారాయణ, గొర్ల సత్తిబాబు, కొలిబోయిన శివ, కశింకోట లక్ష్మణరావు, అంజి తదితరులు పాల్గొన్నారు.


తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు


రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం డి.ఎస్.పి జిఆర్ఆర్ మోహన్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. సీఐ కుమారస్వామి, ఎస్ ఐ సన్నిబాబు పెండింగ్ కేసులు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలని డిఎస్‌పి సూచించారు. .ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో డి సీతారామరాజు పలు శాఖల అధికారులతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పలు అంశాలపై సమీక్షించారు. పిఆర్ యాప్, స్వర్ణ పంచాయితీల అప్డేట్ గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లె పండుగ పనులు తదితర అంశాలపై చర్చించారు. అధికారుల ఆదేశాల మేరకు అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ ఈ ఓ పి ఆర్ డి ఎం శ్రీను, హౌసింగ్ ఏఈ జగన్, ఉపాధి ఏపీవో భాగ్యలత పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని దొండపూడి ఫీడర్ ను రెండు విభాగాలు గా మార్పు చేసే నిమిత్తం ఈనెల 27న శుక్రవారం కొత్తకోట సబ్ స్టేషన్లో బ్రేకర్లు అమర్చే పనులు చేపడుతున్నట్టు, దీంతో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం డివిజన్ ఈఈ రామకృష్ణారావు, రావికమతం విద్యుత్ శాఖ ఏఈ నందన్ గురువారం తెలిపారు. కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో జె.నాయుడుపాలెం, టి.అర్జాపురం, దొండపూడి, కల్యాణపులోవ చీమలపాడు. కొట్నాబిల్లి, గంపవానిపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆలయాలకు దాతల వితరణ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం టీ. అర్జాపురం గ్రామంలో బాల వర సిద్ధి వినాయకుని ఆలయానికి స్టీల్ గేట్లు వితరణగా దాతలు అందించారు. గ్రామానికి చెందిన అప్పాన సత్తిబాబు, నూకరత్నం దంపతులు 25వేలు విలువ చేసే స్టీల్ గేట్లును ఏర్పాటు చేసారు. ఈ గేట్లును అర్చకులు గుంటూరు లక్ష్మణరావుకు గురువారం అందించారు.

మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు. మోదకొండమ్మ అమ్మవారికి వెండి పువ్వుల దండ తయారీ నిమిత్తం అదే గ్రామానికి చెందిన సిరిమీశెట్టి బైరాగి, వరహాలమ్మ కుమారుడు రామక్రిష్ణ, రమాదేవి దంపతులు పావుకిలో వెండి విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు గురువారం అందజేశారు.ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, శ్రీనివాస్ శర్మ, పడాల అప్పల నరసయ్య, జాజిమొగ్గలు చిరంజీవి, మజ్జి ఏసు తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలుకు సిద్ధం

ప్రజాశక్తి -మాడుగుల :రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని మండల వ్యవసాయ అధికారి ఎం వాసుదేవరావు అన్నారు.గురువారం పోతనపూడి, జాలంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతులతో సమావేశమై ఈ ఖరీఫ్ - 2024 సీజన్లో మాడుగుల మండలంలో 4419 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట సాగవుతున్నదని, ఇప్పటివరకు 3690 హెక్టార్లో వరి పంట కోతలు పూర్తయ్యాయన్నారు.ఈ నెల 15వ తేదీ తరువాత కోతలు పూర్తి చేసిన రైతుల వరి పంట, గత 10 రోజులుగా కురిసిన వర్షాలకు తడిచినవి మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా కోత కోసిన వరి పంట వర్షాలకు తడిచి రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని రంగు మారిన ధాన్యంలో తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికీ కొనుగోలు రైతు సేవా కేంద్రానికి ఇచ్చి కనీస మద్దతు ధర పొందే వెసులుబాటు ప్రభత్వం రైతులకు కల్పించిధన్నారు.


మాట్లాడుతున్న ఎఒ

మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలద్వారా ఇప్పటికే 330 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 2300 పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర పిబ్బంది గౌరినాయుడు, గుణమ్మ పాల్గొన్నారు.

గర్భిణికి తప్పని డోలీ మోత


డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- మాడుగుల:రోడ్డు సౌకర్యం లేక పురిటి నొప్పులతో బాధపడుతూ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం జాలం పల్లి పంచాయతీలో చోటుచేసుకుంది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరట నరసింహమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలో జాలంపల్లి పంచాయితీ సిరిపురం గ్రామంలోచెదల వెంకటలక్ష్మి అనే గర్భిణీ బుధవారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతూ ఉండగా స్థానికులు వెంటనే డోలి కట్టి మాడుగుల ప్రభుత్వాసుపత్రికి తరలించారని, ఆ గర్భిణి మగ శిశువుకు జన్మనిచ్చి తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజనులకు డోలి మోతలు తప్పలేదన్నారు. గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పనలో పెద్దపీట వేస్తున్నామని చెప్పడమే తప్ప ఆచరించడం లేదని అన్నారు.ఈ గ్రామానికి రోడ్డు అసంపూర్తిగా నిలిచి పోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతు న్నారని రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి వెంటనే గిరిజనులు కష్టాలను తీర్చాలని ఆయన డిమాండ్ చేసారు.కూటమి ప్రభుత్వం అదికారం లోకి వచ్చిన తర్వాత ఎ గ్రామానికి డోలి మోతలు ఉండ కూడదని స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించి నప్పటికీ గిరిజనులకు డోలి మోతలు తప్పడం లేదన్నారు.రోజు ఎదో ఒక గ్రామంలో గిరిజనులు డోలిలతో మోసుకు వస్తునే ఉన్నారని తెలిపారు.వెంటనే డోలి మోతలు ఆరి కట్టాలని అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్డును పూర్తి చేసి గిరిజనులు కష్టాలు తీర్చాలని నరసింహమూర్తి డిమాండ్ చేసారు.

వాల్తేరు డిఆర్ఎంగా లలిత్ బోహ్రా

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డిఆర్ఎంగా లలిత్ బోహ్రాను నియమిస్తూ రైల్వే శాఖ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ డిఆర్ఎంగా పనిచేసిన సౌరబ్ కుమార్ ప్రసాద్ లంచం తీసుకుంటూ సిబిఐకి చిక్కిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఆపరేషన్ విభాగంలో ఎడిఆర్ఎంగా విధులు నిర్వహిస్తున్న మనోజ్‌కుమార్ సాహుకు వాల్తేరు డివిజన్ తాత్కాలిక డిఆర్ఎం బాధ్యతలను



రైల్వే శాఖ అప్పగించింది. పూర్తిస్థాయి డిఆర్ఎంగా లలిత్ బోహ్రా బాధ్యతలు చేపట్టనున్నారు. 1998 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ బ్యాచ్‌కు చెందిన లలిత్ బోహ్రా ప్రస్తుతం పునరుత్పాద ఇంధన శాఖలో డెప్యుటేషన్‌పై ఉన్నారు. ఆయనకు లాజిస్టిక్ రంగంలో 23 సంవత్సరాలకు పైగా పనిచేసిన అనుభవం ఉంది.సరుకు రవాణా, ప్రయాణికులు, సబర్బన్ రవాణా కార్యకలాపాలు, వాణిజ్య అంశాలలో నిపుణుడుగా పేరుంది.

కాఫీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-చింతపల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాఫీ పండ్లు నేలకూలి రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయని, కాఫీ రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని కిటుముల సర్పంచ్ గెమ్మేలి రమణమ్మ కోరారు. వర్షాలు కారణంగా పండిన కాఫీ పండ్లు మెత్తబడి నేల రాలిపోతుండటంతో నేల పడిన కాఫీ పండ్లు సేకరించేందుకు గిరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. వర్షాలు కారణంగా ఈ ఏడాది కాఫీ రైతులు నష్టపోవడం జరిగిందని, కూటమి ప్రభుత్వం కాఫీ రైతులను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆమెఅన్నారు. కాఫీ చెట్టు నుండి కోసిన పండ్లు నాణ్యతగా ఉన్నప్పటికీ, నేలరాలిన పండ్లుకు దరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - చీడికాడ: మండల కేంద్రంలో నాలుగు అంగనవాడి కేంద్రాలను మండల పరిషత్ అధికారి వి హేమ సుందర్ రావు గురువారం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని తెలిపారు. అనంతరం వెనుకబడిన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు.విద్యార్థులకు సరిపడిన టాయిలెట్లు లేనట్లుగా గుర్తించారు. విద్యార్థులకు పడుకోవడానికి కూడా సక్రమమైన వసతి లేనట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలపై అధికారులకు తెలియజేస్తానని ఆయన విలేకరులకు తెలిపారు.

గోవాడ ఫ్యాక్టరీని ఆదుకోవాలి

ప్రజాశక్తి- మాడుగుల:గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కి పూర్వ వైభవం కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పడాల కొండలరావు కోరారు. గురువారం గాంధీ పార్క్ వద్ద ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో సత్సంబంధాలు కలిగి ఉన్న నేపథ్యంలో ఫ్యాక్టరీని ఆదుకోవాలన్నారు. ఫ్యాక్టరీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి రైతుల కార్మికుల కష్టాలు తొలగించాలని కోరారు. చెరుకుకు టన్నుకు కనీస మద్ధతు ధర రూ.4000 వరకు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు చొరవ తీసుకోని రైతులు, కార్మికులు ఆదుకోవాలని కొండలరావు అన్నారు.


ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాసుడు సప్పరం వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో గ్రామ తిరువీధి సేవను వైభవంగా నిర్వహించారు.